క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



అచ్చంపేట రూరల్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని డీఎస్పీ శ్రీనివాసులు కోరారు. బుధవారం రాత్రి పట్టణంలో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. 60 ద్విచక్ర వాహనాలు, 4 ట్రాక్టర్లను, 4 బొలెరో వాహనాలు పట్టుబడ్డాయి. వాహనదారులకు డీఎస్పీ కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో బాల్య వివాహం చేస్తున్నారని గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి మధుబాబు, కేస్ వర్కర్ కవిత(1098), పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. పెళ్లికూతురు వివరాలు సేకరించి అమ్మాయి మేజర్ కాకపోవడంతో పెళ్లిని నిలిపివేశారు. బాలికను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. బాధిత కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

పరామర్శ

మన్ననూర్: అమ్రాబాద్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీనియర్ నాయకుడు బిరుదు కృష్ణయ్య ఇటీవల మృతి చెందాడు. సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ బుధవారం తుర్కపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ కాశమ్మ, నాయకులు విష్ణు, మల్లయ్య పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



మన్ననూర్: అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి గ్రామంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరం నిర్వహించారు. బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 21 నుంచి 28 వరకు శిబిరం కొనసాగుతుందని వైద్యాధికారి సుధాకర్ తెలిపారు. 5 ఏళ్ల లోపు వయస్సు కలిగిన 30 మంది చిన్నారులకు టీకాలు వేశారు. వైద్య సిబ్బంది మారుతమ్మ, నారాయణమ్మ, చంద్రకళ, గోవయ్య, అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

వెల్దండ: శంకరకొండతండాకు చెందిన రూప్‌సింగ్ ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ యాప్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. టెక్నాలజీ ద్వారా క్రైమ్ కానిస్టేబుల్ అంజినాయక్ సెల్‌ఫోన్ గుర్తించాడు. మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో బుధవారం సీఐ విష్ణువర్ధన్ రెడ్డి బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగించారు. ఎస్ఐ కురుమూర్తి, సిబ్బంది ఉన్నారు.

మొక్కలను పరిశీలించిన అధికారులు



వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామ పంచాయతీ పరిధిలోని అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఈసీ దేవేందర్‌గౌడు, కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన ఉషమ్మ(47), మూడు రోజుల కిందట నక్క బాలస్వామి(48)లు అనారోగ్యంతో మృతిచెందారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున గ్రామానికి చెందిన శెట్టి రాజేష్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డిలు ఆర్థికసాయం అందజేశారు.

అంత్యక్రియలకు..

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని తిలక్ నగర్ కాలనీకి చెందిన డేగరోళ్ళ అంజి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బావాండ్ల మధు బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

కల్వకుర్తి టౌన్: ఉపాధ్యాయులు నిత్యం కొత్త వాటిని నేర్చుకుంటూ నిత్య విద్యార్థులుగా మారాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, కల్వకుర్తి డివిజన్ ఉపాధ్యాయులకు అందించే శిక్షణా శిబిరాన్ని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్‌తో కలిసి పరిశీలించారు. శిబిరంలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు నేర్పించాలన్నారు. అనంతరం డీఈఓ రవీందర్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి వెంకటయ్య, జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, కల్వకురి డివిజన్‌లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల ఎఫ్ఎల్ఎన్ శిక్షణా శిబిరాన్ని అకడమిక్ మానిటరింగ్ అధికారి షర్పోద్దీన్ బుధవారం సందర్శించారు. శిక్షణా తరగతుల నిర్వహణ తీరును పరిశీలించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను విద్యాబోధనలో



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఏఎంఓ షర్పోద్దీన్

వినియోగించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ ఇమ్మాన్యుయేల్ ఉన్నారు.

కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ

తాడూరు: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా పాఠాలు బోధించాలన్నారు. నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో అమలు చేయాలన్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం రెండోరోజు కొనసాగింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణలో రీసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. పలు అంశాలపై శిక్షణ పొందిన మహిళా ఉపాధ్యాయులు శిక్షణ కేంద్రం ఆవరణలో ప్రదర్శన ఇచ్చారు. అంతకు ముందు ఈవీఎస్, ఆంగ్లంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ సత్యానారాయణ శెట్టి హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.రీసోర్స్ పర్సన్లు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో డీఈఓ రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న రవీందర్, ఉపాధ్యాయులు



తాడూరులో శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించొద్దు

కొల్లాపూర్: వరిధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన పెంట్లవెల్లి మండల పర్యటన సందర్భంగా మార్గమధ్యలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును తనిఖీ చేశారు. విక్రయాల కోసం రైతులు తీసుకొచ్చిన వరిధాన్యాన్ని పరిశీలించారు. కొనుగోలు సకాలంలో చేయకపోవడం వల్ల ధాన్యం వర్షానికి తడిసిపోతోందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. కొనుగోలులో ఎందుకు ఆలస్యం అవుతోందని సింగిల్‌విండో సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ భన్సీలాల్ తదితరులు ఉన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

అచ్చంపేట: అమ్రాబాద్ మండల మాచారంలో చెంచులు లేరని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. చెంచుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు చిత్తుగా ఓడించిన ఇంకా అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని చూడడం అవివేకం అన్నారు. గువ్వలకు చెంచుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. మాచారంలో జరిగిన సీఎం బహిరంగ సభ వేదికపైకి 13మంది చెంచులను పిలిపించి వారి చేత వినతి పత్రం అందించామన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో భారీ ప్రమాదం జరిగితే ఏ ఒక్క రోజు మాజీ ఎమ్మెల్యే వచ్చి చూడలేదని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో గువ్వల బాలరాజు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి ప్రజలను వేధించారన్నారు. గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, గౌరీశంకర్, మల్లేష్, కాశన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

పంటలకు సరిపడ నీటిని అందించాలి

తెలకపల్లి: పంటలకు సరిపడ నీటిని అందించాలి వ్యవసాయ శాస్త్రవేత్త సిద్ధప్ప సూచించారు. బుధవారం మండలంలోని గౌరారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ వ్యవసాయ శాస్త్రవేత్త సిద్ధప్ప మాట్లాడుతూ తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే విధానం పాటించడం ద్వారా మొక్కకు నేరుగా నీరు అంది ఎదుగుతుందన్నారు. డాక్టర్ వినూత, దివ్య మాట్లాడుతూ తక్కువ మోతాదులో యూరియా వాడాలన్నారు. రసాయనాలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రాకేష్, రాగేస్, శోభారాణి, సంతోష్, వెంకటేష్, జమ్ములు, వెంకటయ్య, గంగయ్య, రఘుమారెడ్డి, మల్లయ్య, సాయిబు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త సిద్ధప్ప

విద్యుత్ సరఫరాలో అంతరాయం



తిమ్మాజిపేట: మండల కేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పరిధిలో విద్యుత్ సరఫరాలో ఆరు గంటల పాటు అంతరాయం ఏర్పడింది. దీంతో బుధవారం ప్రభుత్వ కార్యాలయలలో అన్ని రకాల సేవలు నిలిచి పోయాయి. తిమ్మాజిపేటలో మూడు మీసేవ కేంద్రాలు, బ్యాంకులు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో భూమి రిజిస్ట్రేషన్లు నిలిచి పోవడం, అవసరాల నిమిత్తం మండలంలోని పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచింది.

కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఉదయం 7 గంటల నుంచి చిన్నపాటి వర్షం కురిసింది. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వేసవిలో విద్యుత్ లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు.

కొల్లాపూర్ నుంచి లింగాలకు బస్సు సౌకర్యం



పెద్దకొత్తపల్లి/లింగాల: కొల్లాపూర్ నుంచి నార్లపూర్, మారెడ్ మాన్‌దిన్నే తండా, యాపట్ల, అసలికుంట గ్రామాల మీదుగా లింగాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. బుధవారం ఆర్టీసీ అధికారులు బస్సును ప్రారంభించారు. ప్రతి రోజు కొల్లాపూర్‌లో ఉదయం 7.30, మధ్యాహ్నం 2.30 గంటలకు అదేవిధంగా లింగాల నుంచి ఉదయం 8.45, సాయంత్రం 3.45 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. కొల్లాపూర్ డీఎం ఉమాశంకర్‌గౌడ్‌కు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.

అందుబాటులో జనుము విత్తనాలు

కల్వకుర్తి రూరల్: రైతులకు 50 శాతం సబ్సిడీపై జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పీఏసీఎస్‌లో 100, రైతు ఆగ్రో కేంద్రంలో మరో 100 జనుము విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం 50% సబ్సిడీతో రూ.2510లకు ప్యాకెట్ ఇస్తునట్లు వివరించారు.

ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో కేక్‌కట్ చేసి కార్యకర్తలు పంచుకున్నారు. డాక్టర్ సింధు, మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు వెంకటేశ్వర్‌రావు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తిమ్మాజిపేట: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండలంలోని ఇప్పలపల్లిలో పలువురు అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

కొల్లాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరవలేనివని టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు కొనియాడారు. బుధవారం పట్టణంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు, పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాముయాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, బింగి మహేష్‌యాదవ్, నాయకులు మేకల నాగరాజు, పసుపుల నర్సింహ, కమలాకర్‌రావు, రహీంపాషా, ఎక్బాల్, రమేష్, సత్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా మాజీప్రధాని వర్ధంతి

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, కిసాన్‌సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, యుజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి శేఖర్, సింగిల్‌విండో డైరెక్టర్ నరేష్, నాయకులు రామస్వామి, పంతునాయక్, తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతలలో..

ఉప్పునుంతల: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. స్థానిక పోచమ్మ చౌరస్తా వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కట్టా అనంతరెడ్డి, నాయకులు రేణయ్య, భాస్కర్, శేఖర్‌గౌడ్, రామచంద్రయ్య, తిర్పతయ్యగౌడ్, భూపిరెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆకస్మిక తనిఖీ



లింగాల: కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఎగుమతి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లానాయక్ సూచించారు. మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న ధాన్యం నిల్వలను ఆయన పరిశీలించారు. వర్షాలు మొదలు అవుతుండడంతో కేంద్రంలో ఉన్న ధాన్యం తడువకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తూకం వేసిన ధాన్యం నిల్వ ఉంచకుండా లారీల ద్వారా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, కొనుగోలు చేయాల్సిన ధాన్యం ఎంత మేరకు ఉందని తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఈఓ పాండు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవాలు

తాడూరు: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన చెన్నకేశవ ఆలయ ఆవరణంలో బుధవారం విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజారోహణం, గురువందనం, గణపతి పూజ, అంకురార్పన, యాగశాల ప్రవేశం, రక్షబంధన్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కలశపూజ, హోమం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

కొల్లాపూర్‌లో వర్షం

కొల్లాపూర్: పట్టణంలో బుధవారం రాత్రి 7 గంటల నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. బలమైన ఈదురు గాలులు వీచాయి. వర్షం కారణంగా మార్కెట్‌యార్డులో విక్రయాలకు తీసుకొచ్చిన వరి ధాన్యాన్ని కవర్లతో కప్పేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

ఉపాధి పనుల పరిశీలన



చారకొండ: ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ సూచించారు. బుధవారం మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించి, కూలీల మాస్టర్‌రోల్‌ను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీల వసతులపై ఆరా తీశారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కల పెంపకంపై జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖదీర్ తదితరులు ఉన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యంపై బుధవారం కేసు నమోదైంది. ఏఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తూడుకుర్తి గ్రామ పరిధిలోని రామ్‌రెడ్డిపల్లి తండాకు చెందిన వైశాలి మంగళవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

లింగాల: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పోల్కంపల్లి రాంమ్మోహన్‌రావు, కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం సాయంత్రం పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర కొనసాగుతుందని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయంతిని విజయవంతం చేయాలని కోరారు.

న్యూట్రిషియన్ కిట్ల పంపిణీ



బిజినేపల్లి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ పరిధిలోని 25 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు 25 న్యూట్రిషన్ కిట్లను పీహెచ్‌సీ వైద్యాధికారి యం.శివకుమార్ బుధవారం పంపిణీ చేశారు. నాట్కో ఫార్మా కంపెనీ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశానుసారం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాట్కో ఫార్మా ప్రతినిధులు సూర్యనారాయణ, మధన్‌కుమార్, రమణారెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాసులు, రమేష్‌కుమార్, గంగ, మంగ, ఆంజనేయులు పాల్గొన్నారు.

పెళ్లి కూతురికి ఆర్థికసాయం



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అర్కంటి బాలస్వామి కొన్ని నెలల కిందట మృతిచెందాడు. ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో ఆయన కూతురు పెళ్లికి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తోటి మిత్రులు, నాయకులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. చారకొండ, వెల్దండ మండలాల నాయకులు ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మనిలా సంజీవ్ యాదవ్ రూ.లక్షతో పాటు క్వింటాల్ బియ్యం, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం రూ. 20 వేలు, చారకొండ మాజీ వైస్ ఎంపీపీ జూపల్లి వెంకటయ్య యాదవ్ రూ. 20 వేలు, వెల్దండ మండల నాయకులు మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, సాంబయ్య గౌడ్, గోపాల్ రెడ్డి, ఐజాక్, జయంత్‌లు రూ. 25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో పెళ్లికూతురు జ్యోతి ప్రధానానికి హాజరై ఆశీర్వదించారు.

తల్లి అంత్యక్రియలపై సోదరుల ఘర్షణ

లింగాల: మండలంలోని సూరాపూర్‌లో ఈ నెల 19న సల్వాల బాలచ్చ అనారోగ్యంతో పెద్ద కుమారుడు లక్ష్మయ్య నివాసంలో మృతిచెందింది. సాంప్రదాయ ప్రకారం చిన్న కుమారుడు నరసింహ ఇంటి నుంచి తల్లి అంత్యక్రియలు ప్రారంభించాలని పెద్ద మనుషులు సూచించారు. ఈ విషయంలో ఇద్దరు సోదరులు ఘర్షణ పడ్డారు. పెద్ద కుమారుడి కొడుకులు రాము, రాజులు చిన్నాన్న, చిన్నమ్మపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

పిడుగుపాటుకు పశువుల మృత్యువాత

చారకొండ: పిడుగుపాటుకు రెండు పశువులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని కమాల్‌పూర్ తండాలో బుధవారం జరిగింది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం కమాల్‌పూర్ తండాకు చెందిన మూడావత్ మగ్యానాయక్ మంగళవారం రాత్రి తమ వ్యవసాయ పొలంలో పశువులను కట్టి ఉంచాడు. బుధవారం ఉదయం వీచిన ఈదురుగాలులతో కూడిన వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు రెండు పశువులు మృత్యువాత పడ్డాయి. పశువుల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఘటన స్థలాన్ని పశుసంపద వైద్య అధికారి షేక్ మదార్ పరిశీలించి, పంచనామా నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే చెంచులకు క్షమాపణ చెప్పాలి



మన్ననూర్: మాచారంలో ఆదివాసి చెంచులు లేరని అసత్య ప్రచారాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ చెంచులకు క్షమాపణ చెప్పాలని మాచారం గ్రామానికి చెందిన ఉడుతనూరి అలివేల డిమాండ్ చేశారు. బుధవారం అమ్రాబాద్ మండలం మాచారంలో చెంచు మహిళలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో చెంచులపై కేసులు పెట్టి జైలుకు పంపించిన ఘనత గువ్వల బాలరాజుకు చెందుతుందన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకుల తీరు మార్చుకోవాలని కోరారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



ఎగిసిపడుతున్న మిషన్ భగీరథ నీరు

తాడూరు: మండల కేంద్రానికి మూడు కిలోమిటర్ల దూరంలో మిషన్ భగీరథ లీకేజీ పైపులైన్ లీకేజీ కావడంతో రోడ్డు జలమయం అయ్యింది. దీంతో ప్రధాన రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

టీజీఆర్‌జేసీలో విద్యార్థి ప్రతిభ

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన పెబ్బేటి మనోజ్ టీజీఆర్‌జేసీ సెట్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో 456 ర్యాంకు సాధించాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడంపై పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ భానుప్రకాష్, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.